సాక్షి నంద్యాల

మంగళవారం ౹ 9 ౹ జూలై ౹ 2024



రూ.లక్ష విరాళం

శ్రీశైలంటెంపుల్: శాశ్వత అన్నప్రసాద వితరణ పథకానికి పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన చింత శ్రీనివాసరావు రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు.



అలరించిన నృత్యప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: ధర్మపథం కార్యక్రమంలో భాగంగా నిత్యకళావేదికపై పశ్చిమగోదావరికి చెందిన ఉమామహేశ్వర నృత్య కళాక్షేత్రం బృందం ప్రదర్శించిన నృత్యం అలరించింది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,601
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 23
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 30,388
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 156

న్యూస్‌రీల్

బుక్కాపురం అరటి పొలాల్లోకి చిరుత

మహానంది: మహానంది, తిమ్మాపురం గ్రామాల పరిధిలో కొద్దిరోజులుగా సంచరిస్తున్న చిరుత తాజాగా సోమవారం ఉదయం బుక్కాపురం సమీపంలోని అరటిపొలాల వైపు వచ్చినట్లు రైతులు తెలిపారు. గ్రామంలోని రైస్ మిల్లు సమీపం నుంచి వెళ్లే మార్గంలో ఉన్న అరటిపొలాల వద్ద చిరుత కనిపించినట్లు రైతులు చెప్పారు. నల్లమల సమీప గ్రామాల ప్రజలు చీకటి పడితే చాలు బయటికి వెళ్లేందుకు జంకుతున్నారు. మహానందిలోని దేవస్థానం కాలనీ సమీపంలోని అటవీ ప్రాంతం శివారు వైపు ఇద్దరు మహిళలు బహిర్భూమికి వెళ్లగా చిరుతను చూసి పరుగులు తీసిన విషయం తెలిసిందే. అటవీశాఖ అధికారులు స్పందించి చిరుతను బంధించే చర్యలు తీసుకోకపోతే మూడు గ్రామాల ప్రజలు ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

క్రెడిట్ కార్డ్ మోసాలపై అప్రమత్తంగా ఉండండి



బాధితుల సమస్యను అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ

బొమ్మలసత్రం: బ్యాంక్ సిబ్బందిమంటూ క్రెడిట్ కార్డు కోసం వివరాలు కావాలని ఎవరైనా అడిగితే ఇవ్వవద్దని జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి జిల్లా ప్రజలను రారు. ఫోన్‌లో ఎటువంటి వ్యక్తిగత సమాచారం అందించినా సైబర్‌నేరగాళ్ల ఉచ్చుల్లో చిక్కుకోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా 89 ఫిర్యాదులు అందాయి. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అధికంగా సివిల్ తగాదాలు, అన్నదమ్ముల కలహాలు, నగదు మోసాలు, అత్తింటి వేధింపుల్లాంటివి వచ్చాయన్నారు. చట్టపరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కారించామన్నారు. మిగతా ఫిర్యాదులను విచారించి చట్టపరిధిలో న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐలు సూర్యమౌళి, రవీంద్ర పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో మెరిట్ కార్డులు

నంద్యాల(న్యూటౌన్): 2023న రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్ఎంఎంఎస్)ఎంపికైన విద్యార్థులు www.bsc.ap.gov.inలో నుంచి మెరిట్ కార్డులు చేసుకోవాలని డీఈఓ సుధాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాటిని స్కాలర్‌షిప్ పోర్టల్ www.scholarships. gov.inలో ఆగస్టు 31వ తేదీలోపు సమర్పించి పాఠశాల నోడల్ ఆఫీసర్ లాగిన్ల ద్వారా అప్రూవ్ చేయించుకోవాలన్నారు.


జిల్లా పోలీస్‌కు కాంస్య పతకం



ప్రశంసా పత్రాన్ని అందిస్తున్న ఎస్పీ

బొమ్మలసత్రం: అస్సాం రాష్ట్రం గౌహతి పట్టణంలో జరిగిన ఇండియా పోలీస్ జూడో క్లస్టర్ 2024–25 జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లాకు చెందిన కానిస్టేబుల్ ఫరాహతుల్లా కాంస్య పతకం సాధించాడు. ఆయనను జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి సోమవారం తన కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నుంచి 16 మంది పోలీసులు క్రీడలకు హాజరు కాగా అందులో జిల్లాకు(త్రీటౌన్) చెందిన కానిస్టేబుల్ ఫరాహతుల్లా తైక్వాండోలో ప్రతిభ కనపరిచి కాంస్య పతకం సాధించడం అభినందనీయమన్నారు. అనంతరం ఫరాహతుల్లాకు ఎస్పీ క్యాష్ రివార్డు, ప్రశంసా పత్రం అందించారు.

సందడి చేసిన 'రాచరికం' బృందం



కాలేజ్ నేపథ్యంలో సాగే సన్నివేశంలో చిత్ర యూనిట్

బేతంచెర్ల: మండలంలో రాచరికం సినిమా బృందం సందడి చేసింది. హీరోలు విజయశంకర్, వరుణ్‌సందేశ్, హీరోయిన్ అప్సరరాణికి సంబంధించి బేతంచెర్ల, కనుమకింది కొట్టాల గ్రామంలో పలు సన్నివేశాలను సోమవారం చిత్రీకరించారు. హనుమాన్‌నగర్ రైల్వే గేటు వద్ద ఫైటింగ్ సన్నివేశాన్ని చిత్రీకరించారు. మంగళవారం బిల్లస్వర్గం గుహల వద్ద పాట సన్నివేశం ఉంటుందని డైరెక్టర్ సురేష్ లంకలపల్లి, ప్రొడ్యూసర్ ఈశ్వర్ తెలిపారు.



నందికొట్కూర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేస్తున్న డాక్టర్ ధార, లబ్బి



శరీన్‌నగర్‌లో వైఎస్ఆర్ జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న రాంభూపాల్‌రెడ్డి



ఆళ్లగడ్డలో కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

రైతు బాంధవుడు వైఎస్సార్

- ఘనంగా వైఎస్సార్ జయంతి
- గ్రామగ్రామానా రాజశేఖరుడికి నీరాజనాలు

దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు సోమవారం జిల్లాలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన సంక్షేమ పాలనను స్మరించుకున్నారు. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చి వ్యవసాయం దండగ కాదు..పండుగ అని నిరూపించి రైతుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని పలువురు వక్తలు కొనియాడారు. – నంద్యాల

➡ ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆళ్లగడ్డ వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి అక్కడున్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విజయడెయిరీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గంగుల విజయసింహారెడ్డి పాల్గొన్నారు.



ఇడుపులపాయలో వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి



శిల్పా స్వగృహంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ పోచా, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మున్సిపల్‌చైర్‌పర్సన్‌మాబున్నిసా, పార్టీ సీనియర్ నాయకులు రాకేష్‌రెడ్డి

నంద్యాలలోని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి స్వగృహంలో మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు జూపల్లె రాకేష్‌రెడ్డిల ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాససెంటర్, సాయిబాబానగర్, చామకాల్వ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కల్లూరు రామలింగారెడ్డి, డాక్టర్ శశికళారెడ్డి, దేశం సుధాకర్‌రెడ్డి, దాల్‌మిల్ అమీర్‌బాషా, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

➡ బనగానపల్లెలోని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్వగృహంలో వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, ఎంపీపీ మానసవీన, జెడ్పీటీసీ లక్ష్మిసుబ్బమ్మ తదితరులు వైఎస్ఆర్ జయంతి సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కొలిమిగుండ్లలో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన ఇడుపులపాయకు వెళ్లి వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పించారు.

➡ నందికొట్కూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ధారా సుధీర్, మాజీ ఎమ్మెల్యే లబ్ధి వెంకటస్వామిల ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నందికొట్కూరులోని కర్నూలు రోడ్డు, కోటావీధి, పాత బస్టాండ్‌ల వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బ్రాహ్మణ కొట్కూరు, జూపాడుబంగ్లా, పాములపాడు మండల కేంద్రాల్లో ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.

➡ కల్లూరు అర్బన్ పరిధిలోని శరీన్‌నగర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



తన స్వగృహంలో కేక్ కట్‌చేస్తున్న మాజీ మంత్రి బుగ్గన

వైఎస్సార్.. చిరస్మరణీయుడు

డోన్: అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించి అందరి హృదయాల్లో దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిరస్మరణీయుడయ్యాడని ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి కొనియాడారు. తన స్వగృహంలో సోమవారం వైఎస్ఆర్ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బుగ్గన మాట్లాడుతూ జలయజ్ఞం పేరుతో రాష్ట్రానికి నీటి వనరులు అందించి సస్యశ్యామలం చేశారన్నారు. ప్రస్తుత పాలకులు కక్షసాధింపులు మానుకోవాలని హితవు పలికారు. తమ హయాంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో సుమారు రూ.4వేల కోట్లతో డోన్‌ను రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దామన్నారు. నూతన అత్యాధునిక భవనాలను చూసి ఇతర ప్రాంతాల వారే ఆశ్చర్యపోతుండగా టీడీపీ నాయకులు మాత్రం పస లేని ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. విమర్శలు మాని అభివృద్ధిపై దృష్టిపెట్టాలని బుగ్గన హితవు పలికారు.

సమస్యల పరిష్కారంలో జాప్యం తగదు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజకుమారి, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం తగదని, వీలైనంతత్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. బాధితుల సమస్యలు అడిగి తెలుసుకుని, విచారించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి పంపారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులే అధికంగా వస్తున్నాయని, క్షేత్రస్థాయిలో వీఆర్‌ఓ, మండల స్థాయి వ్యవస్థ సరిగా పనిచేయడం లేదనే విషయం వ్యక్తమవుతోందన్నారు. పనితీరు మెరుగు పరచుకోవాలని అధికారులకు సూచించారు. కాగా జిల్లావ్యాప్తంగా 123 దరఖాస్తులు అందినట్లు జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు.

అధికారులు సమయపాలన పాటించండి

సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆమె జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తాను అన్ని శాఖల పనితీరును సమగ్రంగా సమీక్షించి, ఆపై క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు తెలుసుకుంటానన్నారు. ఫైళ్లను ఈ– ఆఫీస్ ద్వారానే పరిశీలించి క్లియర్ చేస్తానని, కింది స్థాయి గుమాస్తా నుంచి హైస్థాయి అధికారి వరకు ఈ సైన్‌తోనే ఫైల్ పంపాలని సూచించారు. కోర్టు కేసులకు సంబంధించి అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరికివారు తమ కార్యాలయాలను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పత్రికలలో ప్రచురితమయ్యే ప్రతికూల వార్తలపై వెంటనే స్పందించి, క్షేత్రస్థాయిలో పరిశీలించి అదే రోజు మధ్యాహ్నం 3 గంటల్లోగా సంబంధిత పత్రికలకు వివరణలను చేరవేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సిబ్బందికి రావాల్సిన ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లు ఇతర సమస్యలు పరిష్కరించడంలో తాను ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానన్నారు. అధికారులు సెలవులో వెళ్లాల్సివస్తే మూడు రోజులు ముందుగానే అనుమతి తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు



క్యూలైన్లలో వేచివున్న భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలక్షేత్రానికి భక్తులు పోటెత్తారు. సోమవారం ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే గాక ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. పలువురు భక్తులు మల్లన్నకు గర్భాలయ, సామూహిక అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించుకున్నారు. సర్వ దర్శనానికి 4గంటలు, శీఘ్ర దర్శనానికి 2 గంటల సమయం పట్టింది. అనంతరం భక్తులు క్షేత్ర పరిధిలోని ఉపాలయాలు, శ్రీశైలంప్రాజెక్టును సదర్శించారు.

క్లుప్తంగా

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

కర్నూలు(అగ్రికల్చర్): పశుసంవర్ధకశాఖ ద్వారా సన్న జీవాలు, తెల్లజాతి పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమం కర్నూలు, నంద్యాల జిల్లాలో మొదలైంది. గొర్రెలు, మేకల్లో చిటుకు వ్యాధి, నీలి నాలుక, తెల్ల జాతి పశువుల్లో ముద్ద చర్మపు వ్యాధి(లంపీస్కిన్ డిసీజ్) నివారణకు టీకాలు ఉచితంగా వేస్తున్నట్లు జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం సహాయ సంచాలకులు డాక్టర్ రవిబాబు తెలిపారు. తెల్లజాతి పశువుల్లో లంపీస్కిన్ వ్యాధి నివారణ కోసం కర్నూలు జిల్లాకు 2,34,800 , నంద్యాల జిల్లాకు 1,12,900 డోసుల ప్రకారం వ్యాక్సిన్ వచ్చిందన్నారు. దీనిని రెండు జిల్లాలకు సరఫరా చేసినట్లు చెఅప్పరు. చిటుకు వ్యాధి నివారణ టీకా కర్నూలు జిల్లాకు 12,73,500, నంద్యాల జిల్లాకు 10,49,500 డోసులు సరఫరా చేసినట్లు డాక్టర్ రవిబాబు పేర్కొన్నారు. నీలి నాలుక(బ్లూటంగ్) వ్యాధి నివారణకు కర్నూలు జిల్లాకు 13,15,250, నంద్యాల జిల్లాకు 8.71 లక్షల డోసుల వ్యాక్సిన్ సరఫరా అయిందని తెలిపారు. నెల రోజుల పాటు టీకాలు వేసే కార్యక్రమం జరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు



కిసాన్ అగ్రిమాల్ దుకాణాంలో తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

మిడుతూరు: మండలంలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు సోమవారం తనిఖీలు నిర్వహించారు. మిడుతూరులోని కిసాన్ అగ్రిమాల్, మన గ్రోమోర్ దుకాణాలతోపాటు, చింతలపల్లి, అలగనూరు గ్రామాల్లోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు సుబ్రమణ్యం, సునీల్ కుమార్ బృందం తనిఖీలు చేశారు. ఎరువులు, పురుగు మందుల క్రయ, విక్రయాల రికార్డులు, బిల్లులు సరిగా లేని కారణంగా కిసాన్ అగ్రిమాల్ దుకాణంలోని రూ 4,46,789 విలువైన ఎరువులు, రూ.4,08,551 విలువైన పురుగు మందుల విక్రయాలను నిలిపివేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. 21 రోజుల్లో సరైన రికార్డులు చూపిస్తే కొనుగోలుకు అనుమతిస్తామని వారు తెలిపారు. వారి వెంట నందికొట్కూరు ఏడీఓ విజయశేఖర్, మండల వ్యవసాయ అధికారి పీరునాయక్ ఉన్నారు.

12న జిల్లాస్థాయి జంప్ రోప్ పోటీలు

కర్నూలు (టౌన్): నందికొట్కూర్ పట్టణంలోని నవనందిని ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో ఈనెల 12వ తేదీన జిల్లాస్థాయి సబ్ జూనియర్ అండర్-12 , అండర్- 14 విభాగాల్లో జంప్ రోప్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా జంప్ రోప్ కార్యదర్శి జోసఫ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 27, 28 తేదీల్లో నంద్యాల పట్టణంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జంప్ రోప్ పోటీల్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. వివరాలకు 8790708391 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

పాలిటెక్నిక్ ఫైనల్ అడ్మిషన్ షెడ్యూల్ విడుదల

నంద్యాలన్యూటౌన్: పాలిటెక్నిక్ కళాశాలల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం ప్రభుత్వ చివరి షెడ్యూల్ సోమవారం విడుదల చేసింది. ప్రక్రియలో భాగంగా ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు మొదటి నుంచి చివరి ర్యాంక్ వరకు ఫీజు చెల్లింపు, సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ఆప్షన్ నమోదుకు ఈనెల 14వ తేదీ వరకు, 16న సీట్ల అలాట్‌మెంట్, 18 నుంచి 20వ తేదీలోపు కేటాయించిన కళాశాలల్లో విద్యార్థులు రిపోర్ట్ చేయాలని సూచించారు. వివరాలకు వెబ్‌సైట్‌లో సందర్శించాలని కోరారు. కాగా ఫీజు చెల్లింపునకు ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.700, ఎస్సీ, ఎస్టీలు రూ.250 చెల్లించాలని సంబంధిత అధికారులు పేర్కొన్నారు.



మత్తు వదలరా.. 'సమస్య'గా మిగిలిపోకురా!

ప్రతి ఇంట్లో కుంపటి ఉన్నట్లుగానే.. అందరి జీవితాల్లో ఏదో ఒక సమస్య ఉండటం సహజం. అంత మాత్రాన తనువు చాలించాలనుకోవడం, తాగుడుకు బానిస కావడం.. లోకంలో తానొక్కడే బాధ పడుతున్నట్లుగా సమాజానికి, కుటుంబానికి దూరమవడం పరిపాటిగా మారింది. ఈ ఫొటోలోని వ్యక్తి వయస్సు సుమారు 30 ఏళ్లు. సోమవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో నగరంలోని గణేష్‌నగర్ సుద్దవాగు సమీపంలో ఇలా చెత్తాచెదారం మధ్య తాగిన మైకం తలకెక్కి నిద్ర మత్తులోకి జారుకున్నాడు. ఈ దృశ్యాన్ని చూసిన వాళ్లు ఎవరైనా తల్లిదండ్రులకు చెబితే కన్న పాపానికి వాళ్లు ఎలా తలెత్తుకుని బతకగలరు. ఒకవేళ పెళ్లయింటే.. ఇతడినే నమ్ముకుని ఏడడుగులు నడిచిన, మూడు ముళ్ల బంధంతో ఆ ఇంట్లో అడుగు పెట్టిన ఇల్లాలి పరిస్థితి ఏమిటి? పిల్లలు ఉన్నట్లయితే.. మీ నాన్న ఇలా తాగి ఎక్కడంటే అక్కడ పడిపోతాడంట కదా? అని స్నేహితులు ప్రశ్నిస్తే ఆ లేత మనసులు జీర్ణించుకోగలవా? ఒక్క నిముషం ఆలోచించండి.. ఆ కాలకూట విషం గొంతు దిగక మునుపే మిమ్మల్నే నమ్ముకున్న కుటుంబాన్ని గుర్తు చేసుకోండి.. సమస్యకు కొత్త సమస్యను తోడు చేసుకోకుండా పరిష్కారం దిశగా అడుగులు వేసినప్పుడే మనిషి పుట్టుకకు సార్థకత చేకూరుతుందని గ్రహించండి. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

ఊరిస్తున్న ప్రవాహాలు!

- కృష్ణ, తుంగభద్ర జలాలే ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రధాన సాగునీటి వనరులు
- ఈ జలాల పైనే 7.26 లక్షల ఎకరాల ఆయకట్టు ఆధారం
- టీబీ డ్యాం నుంచి ఈ ఏడాది 27.4 టీఎంసీల నీటి కేటాయింపులు
- రూ.19.4 కోట్ల అంచనాలకు లభించని ఆమోదం!

కర్నూలు సిటీ: ఉమ్మడి కర్నూలు జిల్లాకు కృష్ణ, తుంగభద్ర నదులే ప్రధాన జల వనరులు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా ఈ రెండు నదుల్లో ప్రవాహం ఆశాజనకంగా కొనసాగుతోంది. కృష్ణా బేసిన్‌లో ప్రధానం ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల ప్రాజెక్టులు ఉన్నాయి. ఆ బేసిన్‌లో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టుల్లోకి నీటి చేరికలు పెరిగాయి. అల్మట్టి ప్రాజెక్టులోకి ప్రస్తుతం 60,603 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. మరి కొద్ది రోజుల్లో ఈ ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు సెంట్రల్ వాటర్ కమిషన్ అంచనా వేస్తోంది. అల్మట్టి నిండిన తరువాతే దిగువన ఉన్న నారాయణపూర్ రిజర్వాయర్‌కు కృష్ణమ్మ రానుంది. అదే విధంగా కృష్ణా సబ్ బేసిన్ అయిన తుంగభద్ర నదిలో సైతం నీటి ప్రవాహం రెండు రోజులకు ఒకసారి హెచ్చు, తగ్గులుగా ఉంటోంది. రెండు రోజుల క్రితం 50 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉండగా, సోమవారం నాటికి అది 30 వేల క్యూసెక్కులకు తగ్గింది. కృష్ణా బేసిన్, సబ్ బేసిన్‌లో నీటి ప్రవాహంపైనే ఉమ్మడి జిల్లా ఆయకట్టుదారుల ఆశలు పెట్టుకున్నారు. కొంత నీటి లభ్యత ఉన్న చోట రైతులు వరి సాగుకు నారు పెంచుకున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు చూస్తుంటే ప్రతి రోజు మేఘావృతం అవుతుంది. కానీ వర్షాలు మాత్రం రావడం లేదు. ఇప్పుడున్న పరిస్థితులను బట్టి ఈ నెల చివరిలోపు మంచి వర్షాలు వస్తే ప్రాజెక్టులకు నీరు వస్తుందని జల వనరుల శాఖ ఇంజినీర్లు అంచనా వేస్తున్నారు.

7.26 లక్షల ఎకరాల ఆయకట్టు

ఉమ్మడి జిల్లాలో కర్నూలు–కడప కాల్వ, తెలుగుగంగ, ఎస్ఆర్‌బీసీ, హంద్రీనీవా సుజల స్రవంతి పథకం, సిద్ధాపురం ఎత్తిపోతల పథకం, వరదరాజుల స్వామి ప్రాజెక్టు, తుంగభద్ర దిగువ కాలువ, గురురాఘవేంద్ర ప్రాజెక్టు, పులికనుమ రిజర్వాయర్, పులకుర్తి ఎత్తిపోతల పథకంతో పాటు ఆంధ్రప్రదేశ్ ఆయకట్టు అభివృద్ధి సంస్థ పథకాల కింద 7.26 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ ఆయకట్టుకు సాగు నీరు అందించాలంటే శ్రీశైలం ప్రాజెక్టుల్లో 215 టీఎంసీల నీరు ఉండాలి. ప్రస్తుతం 885 అడుగులకు గాను, 813 అడుగుల నీటి మట్టం, 36.66 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. అదే విధంగా తుంగభద్ర డ్యాంలో 105 టీఎంసీల నీటి సామర్థ్యం ఉండి, డ్యాం నుంచి దిగువన ఉన్న నదిలోకి నీటి విడుదల కొనసాగుతూ ఉండాలి. ఈ డ్యాంలో 40 టీఎంసీలకు పైగా నీరు చేరిన తరువాత సాగునీటి కాలువలకు నీటిని విడుదల చేస్తారు. ఎగువ నుంచి డ్యాంలోకి నీటి ప్రవాహం ఆశాజనకంగా ఉంటేనే నీటిని విడుదల చేస్తారు. ప్రస్తుతం 21 టీఎంసీలు నీరు ఉండగా, ఇన్‌ఫ్లో 30 వేల క్యూసెక్కులు ఉంది. తుంగభద్ర జలాల్లో ఈ ఏడాది ఉమ్మడి జిల్లాకు 27.4 టీఎంసీల నీటిని ఇటీవలే టీబీ బోర్డు స్థాయి పర్యవేక్షక ఇంజినీర్ల సమావేశంలో కేటాయించారు.

అత్యవసర పనులకు 19.50 కోట్లతో అంచనాలు

ఉమ్మడి జిల్లాలోని ఖరీఫ్‌లో సాగు నీటిని అందించేందుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సాగునీటి ప్రాజెక్టులు, కాల్వల్లో అత్యవసరమైన పనులు చేసేందుకు రూ.19.50 కోట్లతో జల వనరుల శాఖ ఇంజినీర్లు అంచనాలు వేశారు. గత నెల 19వ తేదీన రూ.70.37 కోట్లతో ఈ పనులకు ఇంజినీర్లు అంచనాలు వేసి, మంత్రి దగ్గర ఆ ప్రతిపాదనలు తీసుకొని వెళ్లగా, అంత బడ్జెట్ కష్టం అంటూ.. ఇందులో 10 శాతంలోపే అంచనాలను తగ్గించాలని మంత్రి సూచించారు. దీంతో రూ.4.05 కోట్లకు తగ్గించి, తాజాగా రూ.19.50 కోట్లతో అంచనాలు వేశారు. అయితే ఈ అంచనాలకు సైతం నిధుల కొరత ఉందని ఆమోదం తెలపడం లేదని తెలుస్తోంది.

సనాతన ధర్మాన్ని కించపరిస్తే సహించం

- హిందూ ధార్మిక సంస్థల ఆత్మీయ సమ్మేళనంలో వక్తలు



జ్యోతి ప్రజ్వలనతో సమ్మేళనాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్: సనాతన ధర్మాన్ని కించపరిస్తే సహించేది లేదని విశ్వ హిందూ పరిషత్ దక్షిణాంధ్ర ప్రదేశ్ అధ్యక్షులు నందిరెడ్డి సాయిరెడ్డి హెచ్చరించారు. శ్రీ లలితా పీఠం ఆధ్వర్యంలో సోమవారం ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో నాల్గవ హిందూ ధార్మిక సంస్థల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సభాధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ.. విపక్ష నేత రాహుల్ గాంధీ పవిత్రమైన పార్లమెంట్ సాక్షిగా హైందవ సంస్కృతిని కించపరిచేలా మాట్లాడటం గర్హనీయమన్నారు. వైఎస్సార్ జిల్లా బ్రహ్మంగారి మఠం అచలానంద ఆశ్రమం స్వామీజీ విరజానంద ప్రసంగిస్తూ.. హిందువులందరూ హైందవ విలువలతో జీవించటం అత్యంత అవసరమన్నారు. ప్రధాన వక్త వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి కాకర్ల రాముడు మాట్లాడుతూ హిందూ సంప్రదాయాలను ఆచరించడం, గౌరవించడం మనందరి కర్తవ్యం కావాలన్నారు. కందిమల్లాయపల్లె బ్రహ్మంగారి మఠం వీరబ్రహ్మేంద్ర స్వామి 8వ తరం ముని మనుమడు నొస్సం వీరంభట్లయ్య స్వామి, చిన్నటేకూరు సద్గురు నాగలింగేశ్వర జీవైక్య మఠం మఠాధిపతి ఎల్లప్ప స్వామి, జూటూరు గురుసిద్ద నాగసాయి బ్రహ్మ విద్యాశ్రమం పీఠాధిపతి సద్గురు రామానంద స్వామి, ఇస్కాన్ కర్నూలు బాధ్యులు రఘునందన సేవక్‌ప్రభు, లలితా పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రహ్మణ్య స్వామి, తెలుగు భాషా వికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్ఆర్కే శర్మ మాట్లాడారు. అంతకు ముందు జ్యోతి ప్రజ్వలనతో అతిథులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తరిగొండ వెంగమాంబ సేవాసమితి అధ్యక్షులు నీలిమ, సభ్యులు చంద్రమౌళిని, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణ తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ తొగట సురేష్‌బాబు కార్యక్రమ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతిచెందిన మేకల మౌలాలి

ఓర్వకల్లు: జీవాల మేపు కోసం కొడవలిని సానె పట్టించుకునేందుకు వెళ్తూ ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ఏపీ గురుకుల పాఠశాల వద్ద సోమవారం చోటుచేసుకొంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని పాలకొలను గ్రామానికి చెందిన మేకల మౌలాలి(62) అనే వ్యక్తి కొన్నేళ్ల నుంచి గ్రామంలో జీవాలు మేపుకుంటూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో సోమవారం జీవాలకు మేపు కోసం ఉపయోగించే కొడవలిని సానె పట్టించుకునేందుకు గ్రామం నుంచి ద్విచక్ర వాహనం మీద సోమయాజులపల్లె గ్రామానికి బయలుదేరాడు. మార్గం మధ్యలో కాల్వబుగ్గ సమీపంలో గల ఏపీ గురుకుల పాఠశాల ఎదురుగా జాతీయ రహదారిపై మలుపుతిరుగుతున్న క్రమంలో నంద్యాల నుంచి కర్నూలు వైపు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొట్టంది. దీంతో మౌలాలి తీవ్ర గాయాలకు గురయ్యాడు. గాయపడిన వ్యక్తిని కుటుంబ సభ్యులు 108 వాహనంలో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆసుపత్రికి వెళ్లి ప్రమాద వివరాలను సేకరించారు. మృతుని భార్య జహరాబి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్ ప్రసాద్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తెలిపారు. కాగా, మృతుని భార్యతో పాటు, ముగ్గురు కుమారులు సంతానం ఉన్నట్లు తెలిసింది.

నవ బృందావన క్షేత్రంలో సంబరాలు



వసంతోత్సవంలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు, అర్చకులు

మంత్రాలయం: కర్ణాటకలోని గంగావతి నియోజకవర్గం ఆనెగుంది నవ బృందావన క్షేత్రంలో శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు నేతృత్వంలో సంబరాలు చేసుకున్నారు. నవ బృందావన క్షేత్రం విషయంలో ఉత్తరాధిమఠం, మంత్రాలయం మఠం మధ్య బేధాభిప్రాయాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈనెల 3వ తేదీన కర్ణాటక హైకోర్టు నవ బృందావన క్షేత్రంలో శ్రీమఠానికి పరిమితులు వర్తించవని తీర్పు వెలువరించింది. క్షేత్రంలోని నవ బృందావనాల ఆరాధనోత్సవాలు చేసుకోవడానికి శ్రీమఠానికి అధికారాలు కలిప్తూ ఆదేశాలు రావడంతో శ్రీమఠం పీఠాధిపతి నేతృత్వంలో సంబరాలు చేసుకున్నారు. క్షేత్రంలోని మధ్వ మఠ, శ్రీమఠం పీఠాధిపతులకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బాలిక అదృశ్యం.. డీఎస్పీ విచారణ



బాలిక సోదరిని విచారిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

పగిడ్యాల: ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలోని కొత్త ఎల్లాల గ్రామానికి చెందిన తొమ్మిదేళ్ల బాలిక వాసంతి అదృశ్యమైన ఉదంతం సోమవారం వెలుగులోకి వచ్చింది. ఆదివారం మధ్యాహ్నం ఆడుకోవడానికి ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలిక సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు మద్దిలేటి, సుజాత ఆందోళన చెందారు. గ్రామంలో విచారించిన అనంతరం రాత్రి స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. బాలిక అదృశ్యమైనట్లు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ జయశేఖర్ తెలిపారు. విషయం తెలుసుకున్న ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు సాయంత్రం గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. బాలిక ఇంటి వద్దకు చేరుకుని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాలిక మిస్సింగ్ మిస్టరీని ఛేదించేందుకు మూడు టీఎంలను ఏర్పాటు చేశామన్నారు. వీలైనంత త్వరలో బాలిక ఆచూకీ కనిపెడతామన్నారు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి సైతం ముచ్చుమర్రి స్టేషన్‌ను సందర్శించి బాలిక అదృశ్యమై పోలీసులను ఆరా తీశారు.

20న జిల్లాస్థాయి యోగా పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఈనెల 20న జిల్లా స్థాయి యోగా సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యోగా సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి సోమవారం తెలిపారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్‌కార్డు, పాస్‌పోర్టుసైజ్ ఫొటో, బోనఫైడ్ సర్టిఫికెట్ తీసుకు రావాలని, ప్రవేశరుసుం రూ.30 చెల్లించి పాల్గొనాలని తెలిపారు. ప్రతిభ కనబరచిన క్రీడాకారులు విశాఖపట్నంలో నిర్వహించనున్న 49వ రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు.

ప్రత్యర్థుల ఇళ్లకు నిప్పు

- వెంకటనాయునిపల్లెలో ప్రతీకార దాడి

డోన్ టౌన్: పొలం గట్టు విషయమై ఆదివారం వెంకటనాయునిపల్లె గ్రామంలో చోటుచేసుకున్న దాడికి ప్రతీకారంగా సోమవారం మరో దాడి చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యర్థుల ఇళ్లకు, బైకులకు నిప్పంటించారు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన గొల్ల మాదయ్య, ఇంద్రప్రకాష్ మధ్య పొలం గట్టు వివాదం ఉంది. ఈనెల 7న రాత్రి ఇంద్ర ప్రకాష్ మరికొంత మంది కలిసి మాదయ్యపై వేటకొడవళ్లతో దాడికి పాల్పడ్డారు. అతడు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో దాడిలో ప్రమేయం ఉన్న వారు ఇళ్లకు తాళాలు వేసుకుని పరారయ్యారు. కాగా దాడి విషయం జీర్ణించుకోలేని మాదయ్య కుటుంబ సభ్యులు, మరికొంత మంది కలిసి సోమవారం ఉదయం ఇంద్రప్రకాష్, చెన్నయ్య, రంగనాయుడు ఇళ్ల తలుపులు ధ్వంసం చేసి నిప్పు పెట్టారు. ఇళ్ల ఎదుట ఉన్న ద్విచక్రవాహనాలపై సైతం నిప్పు పెట్టారు. సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి గ్రామానికి చేరుకొని పరిస్థితిని అదుపు చేశారు. డోన్ అగ్నిమాపక సిబ్బందిని రప్పించి మంటలను ఆర్పి వేయించారు. ఈ ఘటనలో మూడు ఇళ్లలోని సామగ్రి, రెండు బైకులు అగ్నికి ఆహుతయ్యాయి. కాగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా గ్రామంలో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తెలిపారు.



దాడుల్లో దెబ్బతిన్న ఇంటిలోని వస్తువులు



అగ్నికి ఆహుతైన బైకులు

కేసు నమోదు

మాదయ్యపై దాడి జరిగిన కేసులో బాధితుని కుమారుడు మహేంద్రబాబు ఫిర్యాదు మేరకు ఇంద్రప్రకాష్, చెన్నయ్య, ప్రభాకర్‌నాయుడు, రంగనాయుడు, సురేష్, వెంకటరమణమ్మ, మహేశ్వరి, లక్ష్మీదేవిలపై పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే సోమవారం ప్రత్యర్థుల ఇళ్లకు నిప్పుపెట్టిన ఘటనపై రామాంజనేయులు, మరికొంత మందిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వృద్ధుడి ఆత్మహత్య



వృద్ధుడి మృతదేహం

ఆళ్లగడ్డ: అహోబిలం అడవిలో ఓ గుర్తుతెలియని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. ఆళ్లగడ్డ నుంచి అహోబిలం వెళ్లే ప్రధాన రహదారి నుంచి గండ్లేరు రిజర్వాయర్ వెళ్లే దారి పక్కన అడవిలో ఓ వృద్ధుడు విగతజీవిగా పడి ఉన్నట్లు గమనించిన కొందరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి వెళ్లి పరిశీలించారు. సమీపంలో పురుగు మందు డబ్బా ఉండటంతో వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ నరసింహులు తెలిపారు.



అగ్నివీర్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(హాస్పిటల్): భారత వాయుసేనలో అగ్నివీర్–వాయు ఉద్యోగాలకు ఆన్‌లైన్ ద్వారా పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన సర్వీసుల శాఖ అధికారి పీవీ రమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగాలకు ఇంటర్ మీడియట్/ డిప్లొమా పూర్తి చేసుకున్న అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 8 నుంచి 28వ తేదీ వరకు https://agnipathvayu. cdac.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్, పరీక్ష ఫీజు రూ.550, జీఎస్‌టీ కలిపి చెల్లించిన వారికి అక్టోబర్ 18వ తేదీ తర్వాత ఆన్‌లైన్‌లో అర్హత పరీక్ష నిర్వహిస్తారని, తదుపరి విద్యార్హత ధ్రువపత్రాల పరిశీలన తర్వాత శారీరక దారుఢ్య పరీక్షలు జరుపుతారని పేర్కొన్నారు. ఎంపికైన వారిని నాలుగు సంవత్సరాల షార్ట్‌టర్మ్ సర్వీస్ అగ్నివీర్–వాయు సర్వీస్‌లోనికి తీసుకుంటారని తెలిపారు.

